క్లుప్తంగా

భాగ్యరెడ్డివర్మ వర్ధంతి



వేల్పూర్: రామన్నపేట్‌లో ఆదివారం అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో భాగ్యరెడ్డివర్మ 85వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళితుల అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారని వారు కొనియాడారు. రణధీర్, సుమన్, తిరుపతి, వినోద్, బాబూరావు, రంజిత్ పాల్గొన్నారు.

ఆట వస్తువుల వితరణ



వేల్పూర్: కుకునూర్ ప్రైమరీ స్కూలుకు ఎజిలిటి అనే ప్రైవేట్ కార్పొరేట్ సంస్థ ఆట వస్తువులను వితరణ చేసింది. వితరణ చేసిన పరికరాలను ఆదివారం ప్రారంభించారు. ఐదేళ్ల కింద ఎజిలిటి సంస్థ కుకునూర్ హైస్కూలు, ప్రైమరీ స్కూలును దత్తత తీసుకొని స్కూళ్లకు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా ఆట వస్తువులను సమకూర్చారు. ఎజిలిటి సంస్థ ప్రతినిధులు నరేశ్, మనోహర్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, హెచ్‌ఎం నరేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

శిక్షణకు తరలిన జిల్లా రైతులు



డొంకేశ్వర్(ఆర్మూర్): హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ కాలేజీలో ఆదివారం నిర్వహించిన అగ్రిటెక్ సౌత్–2024 కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుంచి 53 మంది రైతులు తరలివెళ్లారు. శిక్షణ నిమిత్తం చేపట్టిన ఈ విజ్ఞాన యాత్రను వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) పీడీ తిరుమల ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. అగ్రిటెక్ సౌత్ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు పంటల సాగులో నూతన విధానాలను, యాంత్రీకరణపై అవగాహన పొందారు. వీరి వెంట ఆత్మ అధికారులు ఉన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన గౌడ సంఘం నాయకులు



బోధన్: ఎమ్మెల్సీగా ఎన్నికైన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్‌ను ఆదివారం నిజామాబాద్ నగర కేంద్రంలోని ఆయన స్వగృహంలో బోధన్‌కు చెందిన గౌడ సేవా సమితి డివిజన్ అధ్యక్షుడు పి. గంగాధర్ గౌడ్, పలువురు ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మహేష్ కుమార్ గౌడ్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, గౌడ సామాజిక వర్గం రాజకీయంగా ఎదిగేలా ప్రోత్సహించాలని గౌడ సంఘం ప్రతినిధులు కోరారు.

నూతన వీడీసీ కార్యవర్గం ఎన్నిక

బాల్కొండ: బాల్కొండ మండలం కిసాన్‌నగర్(దుబ్బా) నూతన వీడీసీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తమ్మె కపిల్, ఉపాధ్యక్షుడిగా బొంత రాములు, కోశాధికారిగా జక్క రాజలింగం, ప్రధాన కార్యదర్శిగా గడ్డం యాదగిరి, కార్యదర్శిగా పోశెట్టి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని ప్రమాణం చేశారు.

ముక్కు మూసుకోవాల్సిందే!

- పూడిక తీయించడంలో అధికారుల నిర్లక్ష్యం
- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు



33వ వార్డులో మల్లారెడ్డి చెరువు సమీపంలో..



35వ వార్డులో ఓ ఫంక్షన్ హాల్ వద్ద మురికి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని 35వ వార్డులో ఓ ఫంక్షన్ హాల్ వద్ద చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు మురికి కాలువల్లో పేరుకుపోవడంతో మురుగు ముందుకు కదలడంలేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఆ రోడ్డు మార్గాన వెళ్లే ప్రజలు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే పట్టణంలోని 33వ వార్డులో మల్లారెడ్డి చెరువు కట్టపై నుంచి వెళ్లాలంటే కూడా ప్రజలు భయపడుతున్నారు. దుర్వాసన, దోమలతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. చెరువులోనే చెత్తాచెదారం వేస్తున్నారు. వాటిని తొలగించాల్సిన అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. అలాగే దయానంద్ నగర్‌లో రోడ్డు పక్కనే చెత్తా చెదారం వేయడంతో డంపింగ్‌యార్డును తలపిస్తోంది. పట్టణంలోని చాలా వార్డుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు ఇప్పటికైన స్పందించి మురికికాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి, దోమల నివారణ చర్యలు చేపట్టాలని పుర ప్రజలు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం



అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడంతో కార్మికులు పనులు సక్రమంగా చేయడం లేదు. ప్రతిరోజు ఉద యం సానిటరి ఎస్సై, పారిశుధ్య కార్మికులు చేపడుతున్న చోట పర్యవేక్షించాలి. కానీ ఉండక పోవడంతో పనులు సక్రమంగా జరగడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి మురికికాలువల్లో పేరుకుపోయిన పూడికను తీయించాలి. – ప్రశాంత్, ఆర్మూర్

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి



మురికి కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇళ్లలోకి రావడంతో దోమకాటుకు గురై అనారోగ్యానికి గురవుతున్నారు. అధికారులు దోమల నివారణపై దృష్టి సారించాలి. – మురళి, ఆర్మూర్

అన్యాయం జరిగితే ధైర్యంగా ఫిర్యాదు చేయాలి



అవగాహన కల్పిస్తున్న సివిల్ జడ్జి వేముల దీప్తి

బాల్కొండ: ఆడ పిల్లలకు ఎలాంటి అన్యాయం జరిగినా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని ఆర్మూర్ కోర్టు సివిల్ జడ్జి వేముల దీప్తి అన్నారు. ఆదివారం ముప్కాల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు చట్టాలపై నిజామాబాద్ లీగల్ ఎయిడ్ కార్యదర్శి పద్మావతితో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగం అందరికి సమాన హక్కులను కల్పించిందన్నారు. ఎక్కడైన ఆడపిల్లలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. చట్టం ప్రకారం శిక్ష పడే వరకు ఉపేక్షించేది లేదన్నారు. పోక్సో చట్టాలు, ఆన్‌లైన్ మోసాలు, విద్యాహక్కులు, బాల కార్మిక చట్టాల గురించి అవగాహన కల్పించారు. పాఠశాల ఎస్‌వో వినోదా, ఎస్సై భాస్కరా చారీ, ఆర్మూర్ కోర్టు సూపరింటెండెంట్ రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

బాల్కొండ: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. బాల్కొండ మండల కేంద్రంలో నిర్వహించిన మూడు జిల్లాల డే అండ్ నైట్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. క్రీడాకారుల నైపుణ్యం గుర్తించటానికి టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విజేత జట్లకు కప్‌లు, ప్రైజ్ మనీ అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, అన్వర్, యూనిష్, తదితరులున్నారు.



కప్ అందజేస్తున్న సునీల్‌రెడ్డి

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నేత డి గంగాధర్

మాక్లూర్: ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మాణిక్‌భండార్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ఒడ్డేట్‌పల్లిలో ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా పేదల పట్ల కనికరం చూపి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అలాగే నిజామాబాద్ నుంచి పెద్దపల్లికి వేసిన రైల్వే లైన్ వల్ల గ్రామంలో 10 కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించాలన్నారు. సమావేశంలో శివరాజ్, కనకయ్య, సాయిలు, సుమన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గురువులను పూజించాలి



కిసాన్‌నగర్‌లో గురు పాద పూజ చేస్తున్న భక్తులు

బాల్కొండ: గురువులను పూజించాలని సత్యానంద మహర్షి ఆశ్రమాల పీఠాధిపతి శ్రీహరతి తీర్థ స్వామి అన్నారు. బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో మూడు రోజులుగా నిర్వహించిన గీతాశ్రమ వజ్రోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెద్దలను గౌరవించడం, గురువులను పూజించడం సనాతన ధర్మం తెలుపుతుందన్నారు. ధర్మాన్ని ఆచరించడమే నిజమైన భక్తి అన్నారు. గీతాశ్రమ వేడుకలను వైభవంగా నిర్వహించిన భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన 60 మంది మఠాధిపతులు వజ్రోత్సవాల్లో పాల్గొన్నారు. చివరి రోజు భక్తులు గురు పాదపూజ నిర్వహించారు. గురువుల కాళ్లు కడిగి ఆశీర్వచనాలు తీసుకున్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



మామిడిపల్లిలో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న గౌడ సంఘం సభ్యులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ ఆలయ 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఐదు రోజుల పాటు వేడుకలను నిర్వహించనున్నట్లు గౌడ సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మేడిదాల రవి గౌడ్, ప్రవీణ్ గౌడ్, సాగర్ గౌడ్, మాణిక్యం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి పుష్కర బ్రహ్మోత్సవాలు

మాక్లూర్: అడవి మామిడిపల్లి శివారు గుత్ప చౌరస్తా వద్ద ఉన్న అపురూప వేంకటేశ్వర ఆలయంలో ఈ నెల 22 నుంచి 29 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ చైర్ పర్సన్ అమృతలత ఆదివారం తెలిపారు. ఆలయంలో 22న సుప్రభారత సేవ, 23న కుంకుమార్చన, 24న హనుమత్ వాహనము నివేదన, శేషవాహనము, 26న అశ్వవాహనము, 27న వేంకటేశ్వర కల్యాణోత్సవం, గరుడ వాహనము, 28న సుదర్శన నారసింహ, గజవాహన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించే వారు ముందుగానే వారి పేర్లను ఆలయ ప్రాంగణంలో నమోదు చేసుకోవాన్నారు. 29న జరిగే చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని అమృతలత తెలిపారు.

కొనసాగుతున్న ఉత్సవాలు



జలాల్‌పూర్‌లో యజ్ఞం నిర్వహిస్తున్న పండితులు

బాల్కొండ: జలాల్‌పూర్‌లోని రంగనాథుని ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు రెండో రోజు ఆదివారం కొనసాగాయి. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలతో యజ్ఞం నిర్వహించారు. సోమవారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మేడారం జాతరకు 35 బస్సులు

బోధన్: మేడారం సమ్మక్క సారక్క జాతరకు బోధన్ ఆర్టీసీ డిపో నుంచి 35 బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. డిపో పరిధిలోని ప్రధాన మార్గాల్లో నడుపుతున్న బస్సుల ట్రిప్పుల సంఖ్య కొంత తగ్గే అవకాశం ఉంటుందని, ప్రయాణికులు గమనించి సహకరించాలని పేర్కొన్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

పండ్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ



మోపాల్: డిచ్‌పల్లిలోని మానవతాసదన్ విద్యార్థులకు ఆదివారం బోర్గాం(పి)లోని యోగా కేంద్రం ఆధ్వర్యంలో స్టీల్ వాటర్ బాటిళ్లు, పండ్లు పంపిణీ చేశారు. సుమారు 120 మంది విద్యార్థులకు రూ.15వేల విలువైన బాటిళ్లు, పండ్లు అందజేసినట్లు కేంద్రం సభ్యులు తెలిపారు. సభ్యులు ప్రభాకర్, బంటు సంతోష్, రమేష్, ప్రకాశ్, గుత్ప గంగాధర్, జయ ప్రకాశ్, కిషన్ పాల్గొన్నారు.

సమాచారం..

■ నేడు శివాజీ జయంతి సందర్భంగా బైక్ ర్యాలీ

ఆర్మూర్‌టౌన్: శివాజీ ఉత్సవ సమితి నవనాథపురం(ఆర్మూర్) ఆధ్వర్యంలో సోమవారం శివాజీ జయంతి ఉత్సవాలు పట్టణంలో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు శివాజీ చౌక్ నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని చెప్పారు. హిందూ బంధువులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

■ శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగేస్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ ఉంటుందని పేర్కొన్నారు.

ఇరుకు వంతెనతో ఇక్కట్లు..!

- వెంచిర్యాల్ శివారులో కాకతీయ కాలువపై గతంలో నిర్మాణం
- ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన వైనం



వెంచిర్యాల్ శివారులో కాకతీయ కాలువపై ఉన్న వంతెన

బాల్కొండ: ముప్కాల్ మండలం వెంచిర్యాల్ శివారులో కాకతీయ కాలువపై గల ఇరుకు వంతెనతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కాకతీయ కాలువ నిర్మాణ సమయంలో నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. కాలువ అవతలి వైపున స్థానిక రైతుల పంట భూములు అధికంగా ఉన్నాయి. పంట భూములకు హార్వెస్టర్‌లతో వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. ఈ వంతెన మోర్తాడ్ మండలం దొన్కల్ జాతీయ రహదారి 63 నుంచి మెండోరా మండలం చాకిర్యాల్ జాతీయ రహదారి–44 వరకు గల ప్రధాన లింకు రోడ్డుపై ఉంది. దీంతో నిత్యం వాహనాల రద్దీ కూడా ఎక్కువగా ఉంటుంది. దూరాభారం తగ్గుతుండటంతో అధిక శాతం వాహనదారులు ఈ రోడ్డు గుండా ప్రయాణం చేస్తున్నారు. లింకు రోడ్డును డబుల్ రోడ్డు చేశారు. కాని వంతెనను వెడల్పు చేయడం మరిచారు. దీంతో రైతులు, ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. అధికారులు స్పందించి వెంటనే వంతెన వెడల్పు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



కాకతీయ కాలువపై వంతెన చిన్నగా ఉండటంతో ఇబ్బందిగా ఉంది. ఆ వంతెన కూడ ఎప్పుడు కూలుతుందో తెలియడం లేదు. వెంటనే వెడల్పు చేసి వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. – సామ రాజేందర్, రైతు, వెంచిర్యాల్

పిల్లలకు సన్మార్గంపై అవగాహన కల్పించాలి

రుద్రూర్: చిన్న వయస్సులో పిల్లలకు అల్లా చూపిన సన్మార్గంపై అవగాహన కల్పించాలని మరియం మజీద్ సదర్ మమ్మద్ ఇమ్రాన్ ఖాద్రి అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం బాలబాలికలకు నాత్, తక్రిర్‌లపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఇమ్రాన్ ఖాద్రి మాట్లాడుతూ.. ఇస్లాం గురించి వివరించారు. పిల్లలకు చిన్నతనంలోనే అవగాహన కల్పించినట్లయితే ప్రేమ, కరుణ, దయలతో జీవనం సాగిస్తారని, తద్వారా ప్రపంచ శాంతి నెలకొంటుందని అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షర్ఫుద్దీన్, తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ముల్తాని, డివిజన్ స్పోక్ పర్సన్ ఇర్ఫాన్, అక్బర్ నగర్ మజీద్ సదర్ షేక్ మొహమ్మద్, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	రాజధాని ఫైల్స్ (తెలుగు) - 01.00 మేడమ్ వెబ్(ఇంగ్లీష్)- 4.20, 7.00, 9.40
స్క్రీన్-2 –	ఈగల్ (తెలుగు) - 11.30, 03.00, 6.30, 9.50
స్క్రీన్-3 –	ఊరు పేరు భైరవ కోన(తెలుగు) - 1.00, 4.00, 07.00, 10.00
స్క్రీన్-4 –	మేడమ్ వెబ్(ఇంగ్లీష్)- 12.15 హనుమాన్ (తెలుగు) - 3.30, 6.50 ఓయ్(తెలుగు) - 10.10

నిధులు లేక నిలిచిన పనులు



అర్ధాంతరంగా పనులు నిలిచిపోయిన ముల్లంగి(బి) జీపీ భవనం

- ఆరేళ్లుగా పూర్తి కాని ముల్లంగి(బి) జీపీ భవనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

మాక్లూర్: నిధులు లేక ముల్లంగి(బి) జీపీ భవనం నిర్మాణ పనులు అర్ధాంతంగా నిలిచిపోయి 6 సంవత్సరాలు కావస్తున్నా పట్టించుకునే నాథులు కరువయ్యారు. అప్పట్లో గ్రామస్తుల విన్నపం మేరకు అప్పటి ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి, జీపీ భవన నిర్మాణానికై రూ.12 లక్షల నిధులు మంజూరు చేయించారు. 2017 డిసెంబర్‌లో పనులు ప్రారంభించారు. బిల్డింగ్ పనులు పూర్తి చేసి వదిలేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ పనులు జరగలేదు. ఫలితంగా బిల్డింగ్‌కు పగుళ్లు ఏర్పడుతుండటంతో కూలిపోతుందేమోనని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిగిలిపోయిన పనులకు నిధులు మంజూరు చేయించి పూర్తి చేయించాలని ముల్లంగి(బి) ప్రజలు కోరుతున్నారు.

గోడలకు పగుళ్లు వస్తున్నాయి

మా గ్రామంలో ప్రస్తుతం ఉన్న జీపీ బిల్డింగ్ కాలం చెల్లింది. గతంలో కొత్త భవనం నిర్మాణానానికై రూ.12 లక్షల నిధులు మంజూరయ్యాయి. పనుల ను 2017లో ప్రారంభించి అర్ధాంతరంగా నిలిపి వేశారు. ఇప్పటికి 6 సంవత్సరాలు కావస్తోంది. గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. కూలిపోతుందేమోనని అన్పిస్తుంది. అధికారులు స్పందించి మరి న్ని నిధులు మంజూరు చేయించి, మిగిలిపోయిన పనులను పూర్తి చేయించాలి. – ఆశన్న, గ్రామస్తుడు, ముల్లంగి(బి)

పొంచి ఉన్న ప్రమాదం

- రోడ్డు పక్కనే వ్యవసాయ బావి
- కనిపించకుండా పెరిగిన పొదలు
- హెచ్చరిక బోర్డులు మాయం



రోడ్డు పక్కన పొదల్లో ఉన్న బావి



అవతలి వైపు నుంచి కనిపిస్తున్న బావి

బాల్కొండ: 2018లో మెండోరా మండల కేంద్రం శివారును న్న వ్యవసాయ బావిలో ప్రయాణికులతో వస్తున్న ఆటో అదుపు తప్పి బావిలో పడటంతో పది మంది జల సమాధి అయ్యారు. అయినా అధికారుల్లో ఎలాంటి మార్పు రాలేదు. మెండోరా మండలం సావెల్ గ్రామ శివారులో రోడ్డు పక్కనే పొదల్లో వ్యవసాయ బావి కనిపించకుండా ఉన్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కనీసం అక్కడ వ్యవసాయ బావి ఉన్నట్లు హెచ్చరిక బోర్డులను కూడా పెట్టించ లేదు. రోడ్డుకి ఓ వైపు వ్యవసాయ బావి ఉండగా.. మరో వైపు కోతకు గురై గుంతలు ఏర్పడ్డాయి. ఎటు వైపు పడినా పెద్ద ప్రమాదమే జరుగుతుంది. ఉన్నత అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే వ్యవసాయ బావి వద్ద కంచెను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో వ్యవసాయ బావిలో ప్రమాదం సంభవించినప్పుడు అధికారులు హడావిడి చేసి రో డ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావుల వద్ద హెచ్చరిక బోర్డులు, కొన్ని చోట్ల కంచెలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి ఎక్కడా కనిపించడం లేదు. వాటి గు రించి పట్టించుకున్న నాథుడే లేడు. హెచ్చరిక బో ర్డులు కూడా ఎత్తుకెళ్లారు. కంచెలను తెంపుకెళ్లారు. దీంతో మళ్లీ ప్రమాదకరంగా మారాయి. మెండోరా మండలం బుస్సాపూర్ నుంచి మెండోరా మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు వెడల్పు కావడంతో వ్యవసా య బావులు రోడ్డుకు మరింత దగ్గరగా అయ్యాయి. ఒకటి, రెండు చోట్ల రక్షణ రెయిలింగ్ ఏర్పాటు చేశా రు. మిగతా చోట్ల కనీసం హెచ్చరిక బోర్డులు కూడ లేవు. అధికారులు స్పందించి రక్షణ గోడలు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న బావుల వద్ద కంచెలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయటానికి చర్యలు చేపడుతాం. ప్రయాణికులు జాగ్రత్తగా వాహనాలను నడపాలి. రైతులతో మాట్లాడి కంచెలు ఏర్పాటు చేస్తాం. – వినీత్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, బాల్కొండ

మదర్స్ మీట్‌లో అలరించిన నృత్య ప్రదర్శన



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల విజ్ఞాన్ పాఠశాలలో ఆదివారం మదర్స్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి గొప్పతనం గురించి ప్రిన్సిపాల్ విద్యాకర్ పవార్ వివరించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. తల్లులతో కలిసి పిల్లలు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నిషార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.